అవుట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆర్అండ్‌బి బంగ్లాలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు వాచ్‌మెన్, శానిటేషన్ పనులు, అటెండరు పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ జాన్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. www.srikakulam.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను పొందుపరిచినట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను మార్చి నాలుగో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు నగరంలోని సాయిబులతోటలో గల ఆర్అండ్‌బి ఎస్ఇ కార్యాలయంలో పనివేళల్లో అందజేయాలని సూచించారు.



రేగులపాడు వద్ద అర్ధాంతరంగా నిలిచిన రిజర్వాయర్ పనులు

ఆఫ్‌షోర్ ప్రాజెక్టు అంతులేని కథను తలపిస్తోంది. మూడు సార్లు ఎన్నికలై మరికొద్ది నెలల్లో నాలుగో టెర్మ్ ఎన్నికలూ జరుగబోతున్నాయి. ప్రతి ఎన్నికల్లోనూ వైసిపి, టిడిపి ఆఫ్‌షోర్ అంశాన్ని ప్రచార అస్త్రంగానే వాడుకుంటున్నాయి. ఆఫ్‌షోర్‌కు తమ హయాంలో నిధులు కేటాయించామని, ఈ ప్రభుత్వం పనులను పూర్తి చేయలేకపోయిందంటూ అధికార పక్షాన్ని విమర్శిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదిగో అదిగో ఈ ఖరీఫ్‌కే నీళ్లిచ్చేస్తున్నామంటూ ప్రజలను నమ్మిస్తున్నారు. ఇలా 16 ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పటికీ సగం పని కూడా జరగలేదు. అంచనాల పెంపుతో రిజర్వాయర్ పనులను చేపట్టిన కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరింది తప్ప రైతులకు వీసమంత ప్రయోజనం కలగలేదు.

ఆఫ్‌షోర్ నీళ్లు.. ఇంకెన్నేళ్లు..!

- 16 ఏళ్ల కిందట ప్రారంభమైన రిజర్వాయర్ పనులు
- ఇప్పటికీ 45 శాతమే పూర్తి
- ప్రకటనలకే పరిమితమైన సాగు, తాగునీరు
- ప్రజాప్రతినిధులకు ఆదాయ వనరుగా ప్రాజెక్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి, మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్.వి.ఇ.సి-ఇందు సంస్థతో రూ.123.25 కోట్లతో ఫిబ్రవరి 18, 2007లో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం 2008 జనవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. భూసేకరణ పనులు సకాలంలో చేయకపోవడం, ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించకపోవడంతో 2014 వరకు పనులు ప్రారంభం కాలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం, రిజర్వాయర్ పనులను మళ్లీ అదే సంస్థకు అప్పగించింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరించి రూ.466.28 కోట్లకు పెంచింది. ప్రాజెక్టు పనుల పూర్తికి జూలై 7, 2019 వరకు గడువు ఇచ్చింది. టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిన నాటికి 38 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

నాలుగున్నరేళ్లలో ఏడు శాతమే పనులు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మిగిలిన పనులకు సంబంధించి కొత్త రేట్లతో రూ.855 కోట్ల అంచనా వ్యయంతో 2021 సెప్టెంబరులో అధికారులు ప్రతిపాదనలు పంపగా 2022 సెప్టెంబర్‌లో సవరించిన అంచనాల మేరకు రూ.852.45 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇప్పటివరకు 45 శాతం పనులు మాత్రమే జరిగాయి. అంటే నాలుగున్నరేళ్లలో ఏడు శాతమే పనులు జరిగాయి.

> **పనులు 45 శాతం... ఖర్చు 70 శాతం**
>
> రిజర్వాయర్ పనులు ఇప్పటివరకు 38 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఖర్చుల విషయంలో మాత్రం గత టిడిపి ప్రభుత్వం ఎక్కడా తగ్గలేదు. రిజర్వాయర్ నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.123.25 కోట్ల నుంచి రూ.466.28 కోట్లకు పెంచిన విషయం తెలిసిందే. అందులో రూ.325.45 కోట్లను వెచ్చించింది. అంటే 70 శాతం మేర ఖర్చు చేసింది.

45 శాతం పనులే పూర్తి

రిజర్వాయర్ పనులు ప్రస్తుతం 45 శాతం మేర జరిగాయి. మట్టిపనులు 83,31,000 క్యూబిక్ మీటర్లు చేపట్టాల్సి ఉండగా, 42,36,527 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. ఇంకా 40,94,473 క్యూబిక్ మీటర్ల పని మిగిలి ఉంది. కాంక్రీట్ పనులు 1,31,544 క్యూబిక్ మీటర్ల కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,457 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. మరో 1,29,087 క్యూబిక్ మీటర్ల పని పెండింగ్‌లో ఉంది.

పెరిగిన ప్రాజెక్టు వ్యయానికి బాధ్యులు ఎవరు?

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.123.25 కోట్లతో ప్రారంభమయ్యాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అంచనా వ్యయాన్ని అమాంతం రూ.466.28 కోట్లకు పెంచింది. అందులో రూ.325.45 కోట్లను ఖర్చు చేసింది. ఇప్పుడు తాజాగా ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.123.25 కోట్ల నుంచి రూ.855 కోట్లకు చేరింది. అంటే రూ.731.75 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రజలు చెల్లించిన పన్నులతో ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తున్న పాలకులు, ఇలా మంచినీళ్లలా వృథా చేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.


ఆదాయ వనరుగా మారిన రిజర్వాయర్

ఆఫ్‌షోర్ ప్రాజెక్టును అగ్రిమెంట్ ప్రకారం 2008 జనవరి అంటే ఏడాదిలోగా పూర్తి చేయాల్సి ఉంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 16 ఏళ్లు గడిచినా నిర్మాణ పనులు పూర్తి కాలేదు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.123.25 కోట్ల నుంచి రూ.466.28 కోట్లకు పెంచింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.466.28 కోట్ల నుంచి రూ.852.45 కోట్లకు పెంచింది. రిజర్వాయర్‌ను సకాలంలో పూర్తి చేస్తే రూ.123 కోట్లు సరిపోయేవి. కానీ అదనంగా రూ.731.35 కోట్లను ఖర్చు చేయాల్సి వచ్చింది. అగ్రిమెంట్ ప్రకారం పని చేయలేకపోయిన కాంట్రాక్టర్‌పై పలు క్లాజ్‌ల కింద అధికారులు చర్యలు తీసుకునే అవకాశమున్నా, ఎందుకు ఉపేక్షిస్తున్నారన్నదే ఇక్కడ ప్రశ్న. ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా? లేదా కాంట్రాక్టర్‌తో ఏమైనా లాలూచీ పడుతున్నారా అనే అనుమానాలు అందరిలోనూ తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరుగుతున్న ప్రతి సందర్భంలో అంచనాలు పెంచడం, అగ్రిమెంట్ కాలపరిమితి పొడిగించడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా ఈ పద్ధతికి ముగింపు పలకాల్సి ఉంది. మరికొద్ది నెలల్లో ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో ప్రజలే దీనిపై నిలదీయాల్సిన సమయం ఆసన్నమైంది.

26న చంద్రబాబు నాయుడు రాక

శ్రీకాకుళంలో రా.. కదలి రా సభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



ఈనెల 26వ తేదీన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు జిల్లాకు రానున్నారు. శ్రీకాకుళం నగరంలో 80 అడుగుల రోడ్డు వద్ద ఆరోజు నిర్వహించే రా.. కదలి రా బహిరంగ సభలో ఆయన పాల్గొనున్నారు. ఈ సభకు సుమారు అధిక సంఖ్యలో జనాలు హాజరయ్యేలా ఆ పార్టీ నాయకత్వం సన్నాహాలు చేస్తోంది. తొలుత ఈ సభను టెక్కలిలో నిర్వహించాలని భావించినా, జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో జనాలు హాజరయ్యే అవకాశమున్న నేపథ్యంలో స్థలాభావం ఏర్పడుతుందని భావించారు. దీంతో ఈ సభను జిల్లా కేంద్రానికి మార్చారు.

సభను విజయవంతం చేయాలి

రా... కదలి రా బహిరంగ సభను జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సభా నిర్వాహక కమిటీ సభ్యులు ఎస్.వి రమణ మాదిగ కోరారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సభకు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరానున్నట్టు తెలిపారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులోని ఖాళీ స్థలంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, బొనిగి భాస్కరరావు, అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ వాలంటీర్లను వైసిపి బూత్ ఏజెంట్లుగా పనిచేయాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పడం సరికాదన్నారు.

ఐదేళ్లుగా ప్రజా ధనాన్ని గౌరవ వేతనంగా పొందుతున్న వాలంటీర్లను పార్టీ కార్యకర్తలుగా, బానిసలుగా పనిచేయాలని ఆదేశించడం అప్రజాస్వామికమన్నారు. వాలంటీర్లపై వైసిపి నాయకులకు ఉన్న భావన మరోమారు బయటపడిందన్నారు. ఇప్పటికైనా వాలంటీర్లు వైసిపి నాయకుల నైజాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, నాయకులు వి.సూరిబాబు, ప్రదాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, రిమ్స్ వైద్య కళాశాల ఆస్పత్రుల్లో ఆరు విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.స్వామినాయుడు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటాచలం తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, ఆంకాలజీ, సి.టి సర్జరీ అవుట్ పేషెంట్ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సూపర్ స్పెషాల్టీలో ఆరు విభాగాల్లో వైద్య సేవలను రోగులు వినియోగించుకోవచ్చని తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల్లో వారానికి రెండు రోజులు ప్రత్యేకంగా ఒపి వైద్య సేవలను అందించనున్నట్లు చెప్పారు.



సూపర్ స్పెషాల్టీ సేవలను ప్రారంభిస్తున్న స్వామినాయుడు

జిల్లాలో తొలిసారిగా ఒకేసారి ఆరు విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ కె.సునీల్ నాయక్, డాక్టర్ ఎం.వి.సత్యానంద్, ఆర్ఎంఒ వి.బి సుభాషిణి, సూపర్ స్పెషాల్టీ ప్రొఫెసర్లు, సహాయక ప్రొఫెసర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్, 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలు, టెట్, డిఎస్‌సి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. పది, ఇంటర్, టెట్, డిఎస్‌సి పరీక్షలపై తాడేపల్లిలోని విద్యాశాఖ కార్యాలయం నుంచి స్కూల్, ఇంటర్ ఎడ్యుకేషన్ల కమిషనర్లు సురేష్ కుమార్, సౌరభ్‌గౌర్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముమ్మర తనిఖీల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు నిరంతర విద్యుత్, ఫ్యాన్లు, లైటింగ్ సక్రమంగా ఉండేలా కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. సకాలంలో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్‌టిసి బస్సులను పలు రూట్లలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పరీక్షా కేంద్రాలను సెల్‌ఫోన్ ఫ్రీ జోన్‌గా ప్రకటించిన నేపథ్యంలో సిబ్బంది, విద్యార్థులు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో డిఇఒ వెంకటేశ్వరరావు, విద్యాశాఖ పరీక్షల సహాయ కమిషనర్ ఆలీఖాన్, ఆర్ఐఒ దుర్గారావు, డివిఇఒ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ మానవత్వం

బ్రెయిన్‌డెడ్ మహిళ అవయవదానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అవయవ దానం ఓ గొప్ప సంకల్పం. తాను చనిపోతూ మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపే ఓ అద్భుత కార్యక్రమం. అటువంటి అవయవదానం కార్యక్రమానికి మరోమారు వేదికైంది జెమ్స్ హాస్పిటల్. బ్రెయిన్ డెడ్ అయిన పాతపట్నం మండలం పెదలోగిడికి చెందిన జైనవలస ఉషారాణి (40) అవయవాలు దానం చేసేందుకు ఆమె కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. పద్మావతి ఈనెల 19న తన మరిది ఇళ్లు చూపులు శుభకార్యానికి వెళ్తూ హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఉషారాణి తీవ్రంగా గాయపడి జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. మూడు రోజులుగా వెంటిలేటర్‌పై ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తూ వచ్చారు. అయినా చికిత్సకు ఏమాత్రం స్పందించలేదు. ఈనెల 21న అర్ధరాత్రి దాటిన తరువాత బ్రెయిన్ డెడ్ అయినట్లు వైదులు చెప్పారు. ఆమె భర్త కృష్ణారావు, పిల్లలు నిఖిత, పల్లవి, జోషిత్ ఉషారాణి అవయవదానానికి ముందుకు రావడంతో వైద్యులు జీవన్‌దాన్‌కి దరఖాస్తు చేయడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. ఆమె లివర్‌ను విశాఖపట్నంలో పిన్నాకల్ హాస్పిటల్‌కు, ఒక కిడ్నీని విశాఖపట్నం కెజిహెచ్‌కు, మరో కిడ్నీని జెమ్స్ ఆస్పత్రికి, రెండు కళ్లను రెడ్‌క్రాస్‌కు అందించారు. అవయవదానానికి అంగీకరించిన కుటుంబసభ్యులకు ధ్రువపత్రాలను అందజేశారు.

నివాళ్లర్పించిన జెమ్స్ సిబ్బంది



ఉషారాణి (ఫైల్)

అవయవదానం చేసిన ఉషారాణి మృతదేహానికి జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పూలమాలలు ఉంచి నివాళ్లర్పించారు. ఆమె మృతదేహం తరలిస్తున్న దారిపొడవునా విద్యార్థినులు పూలు చల్లి ఉషారాణి అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఎఒ ఎస్.రామ్మోహన్, డైరెక్టర్ సుధీర్, ప్రిన్సిపాల్ లక్ష్మీ లలిత, హాస్పిటల్ సూపరింటెండెంట్ అశోక్ రెడ్డి, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ శివఅన్వేష్, ఆర్ఎంఒలు బాలమురళీ, ప్రవీణ్, ఆపరేషన్ మేనేజర్ జోత్స్న పాల్గొన్నారు.



ఉషారాణి మృతదేహానికి నివాళ్లర్పిస్తున్న జెమ్స్ వైద్యులు

రైతులపై బిజెపి ప్రభుత్వ దుర్మార్గం

ప్రజాశక్తి పలాస

పంటలకు కనీస మద్దతు ధర కోసం పోరాడుతున్న రైతులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు విమర్శించారు. రైతు ఉద్యమంపై బిజెపి ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా పలాస-కాశీబుగ్గ పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద రైతు, కార్మిక, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పోలీసులతో చేయించిన కాల్పుల్లో యువ రైతు శుభకరణ్ సింగ్‌ను బలిగొన్నారని చెప్పారు. ఇంతకముందు మరో రైతు గుండెపోటుతో మరణించారని తెలిపారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు సిహెచ్.సుందర్‌లాల్, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి వి.మాధవరావు, లిబరేషన్ నాయకులు, టి.సన్యాసిరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ డి.జీవితేశ్వరరావు మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్నను అధోగతి పాలు చేసే కేంద్ర ప్రభుత్వాన్ని, దానికి వత్తాసు పలుకుతున్న పార్టీలను ప్రజలు భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సిహెచ్.వేణుగోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, కాంగ్రెస్ నాయకులు కె.హేమారావుచౌదరి, ఎఐసిసిటియు నాయకులు డి.శ్రీనివాస్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్, ఎఐవైఎఫ్ నాయకులు జి.భాస్కరరావు, ఎం.రామారావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనూ నామినేషన్ల దాఖలు

ఎన్నికల అదనపు కమిషనర్ హరిందర్ ప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రానున్న సార్వత్రిక ఎన్నికలకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లు సమర్పించేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించిందని రాష్ట్ర ఎన్నికల అదనపు కమిషనర్ ఎం.ఎన్ హరిందర్ ప్రసాద్ తెలిపారు. నిర్ణీత నమూనాలో suvidha.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా నామినేషన్లు దాఖలు చేసే అవకాశాన్ని ఈ ఏడాది కల్పించిందని వివరించారు. జిల్లాల నోడల్ అధికారులతో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో వెబ్‌సైట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నామినేషన్ల గడువు ముగిసే ముందు రోజు వరకూ నిర్దిష్ట విధానంలో సాధారణ నామినేషన్ తరహాలోనే ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుందని వివరించారు. దరఖాస్తు ఫారంలో దశల వారీగా అభ్యర్థుల వివరాలు, వారి ఆస్తుల అఫిడవిట్ పత్రాలు, నిర్ధారిత నామినేషన్ డిపాజిట్, పది మంది బలపరచాల్సిన వారి వివరాలు సైతం ఇవ్వాలన్నారు. ప్రతి దశలో ముందుగా వచ్చిన వివరాలు నమోదు చేసిన తర్వాత ప్రక్రియ ముందుకు వెళ్తుందని తెలిపారు. అభ్యర్థి తన డిపాజిట్ కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని చెప్పారు. అన్నింటిని సమర్పించిన తర్వాతనే నామినేషన్ దాఖలు చేసేందుకు ఉన్న నిర్ణీత సమయంలో స్లాట్ సమయాలను బుక్ చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారిని నేరుగా కలిసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వివరాలతో కూడిన పత్రాలను నామినేషన్ చివరి రోజులోగా తప్పనిసరిగా అందించాలన్నారు. రిటర్నింగ్ అధికారికి నేరుగా అందిస్తేనే నామినేషన్ దాఖలు చేసినట్లుగా భావిస్తామని స్పష్టం చేశారు. ఒక అభ్యర్థి ఆన్‌లైన్ ద్వారా ఎన్ని నామినేషన్లు అయినా వేయొచ్చని, అందులో ఒకటి మాత్రమే చెల్లుబాటు అవుతుందన్నారు. నామినేషన్లను ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దాఖలు చేయొచ్చని చెప్పారు. శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ ఎం.అప్పారావు, నోడల్ అధికారులు సిపిఒ ప్రసన్నలక్ష్మి, డ్వామా పీడీ చిట్టిరాజు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి చెన్నకేశవరావు, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



కనీస వేతనాలను అమలు చేయాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎఆర్‌ఎఆర్ఎస్‌లు, కెవికెల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ కనీసవేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆచార్య ఎన్‌జి రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్మికులు సమ్మెలో భాగంగా ఏడో రోజు గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపిన అనంతరం వారు మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను అప్కాస్‌లో చేర్చాలన్నారు. కార్మికులు మరణిస్తే సహజ మరణానికి రూ.రెండు లక్షలు, ప్రమాద మరణానికి రూ.ఐదు లక్షల పరిహారం చెల్లించేందుకు జారీ చేసిన జిఒను కాంట్రాక్టు కార్మికులకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కార్మికులు పాముకాటు, ఇతర ప్రమాదాలకు గురైనప్పుడు కృషి విజ్ఞాన కేంద్రం, రీసెర్చ్ స్టేషన్ అధికారులు బాధ్యత తీసుకొని వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ పరిధిలో ఖాళీ ఉద్యోగాల భర్తీలో కాంట్రాక్టు కార్మికులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్మికుల వివరాలను రీసెర్చ్ స్టేషన్లలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది పొడవునా ఉపాధి కల్పించాలని, కార్యాలయంలో స్వీపర్, అటెండర్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్మిక శాఖ ఆదేశాల ప్రకారం జాతీయ పండుగ సెలవులను వర్తింపజేసి, రోజుకు రూ.650 దినసరి వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షులు ఎన్.సీతామహాలక్ష్మి, కార్యదర్శి త్రివేణి, కె.కృష్ణవేణి, ఎ.యుగంధర్, గణపతి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విజయ

ఇంటింటికీ సంక్షేమం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డే దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జెడ్‌పి నిధులు రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆడిటోరియంను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగన్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు భారతి దివ్య, లాభాల స్వర్ణమణి, జెసిఎస్ కన్వీనర్ ఆసి పురుషోత్తంరెడ్డి, ఆసి కృష్ణారెడ్డి, ఉప్పాడ రాజారెడ్డి, పట్టణ అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, కె.మోహనరావు పాల్గొన్నారు.

సమిష్టిగా పనిచేస్తే విజయం మనదే



వెంకన్న చౌదరి

పలాస : టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే నియోజకవర్గంలో తప్పకుండా గెలుస్తామని టిడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మున్సిపాలిటీ కుటుంబ సాధికారత సారథులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ సాధికారత సభ్యులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, బిఎల్‌ఎ, బిఎల్‌ఐలు వచ్చే ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో పిరికట్ల విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణరావు, దువ్వాడ సంతోష్, హర్ష, తమ్మినేని గంగారాం, ఒరియా మోహనరావు, కద్దాలా నాగేశ్వరరావు, బి.రాజు, మురిపింటి కుమార్‌రాజు, మామిడి కమలమ్మ, తలగాణ నర్సింహమూర్తి, వంకల కూర్మారావు, సార జోగారావు, రాపాక పురుషోత్తం, వడ్డి యాదగిరి, సవర సోమేష్, అరియాపల్లి ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే విజయాలు

నరసన్నపేట: మనల్ని మనం మార్చుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట ప్రిన్సిపాల్ వావిలపల్లి నారాయణస్వామి అన్నారు. లైబ్రేరియన్ వదనగిరి అధ్యక్షతన విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడి అధిగమించడం - మంచి మార్పులను సాధించడం, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడంలో అనే అంశాలపై కళాశాల ఆవరణలో గురువారం అవగాహన కల్పించారు. ఇంటర్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడి నిర్వహణ - మానసిక ఆరోగ్యం ద్వారా ఆత్మవిశ్వాసంతో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురవరపు సత్యనారాయణ, అప్పన్న, డాక్టర్ మల్లేష్, సోమశేఖర్, ఆనందరావు, లక్ష్మీనారాయణ, హరిప్రసాద్, సురేష్, రూపవతి, కూన హరిప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఇంటర్, పది పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడిని జయించడానికి ప్రతిరోజూ గంటసేపు యోగా చేయాలని జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు సూచించారు. నగరంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో యోగా కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ కృష్ణవేణితో కలిసి ఆయన ప్రారంభించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు ఈ యోగా ప్రక్రియను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో యోగా అధ్యాపకులు మురళీకృష్ణ, కోరాలి రేణుక, కె.నాగలక్ష్మి, నటుకుల మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణస్వామి

అధ్వాన రోడ్లతో అవస్థలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జిల్లాలో అతిపెద్ద గిరిజన మండలమైన మెళియాపుట్టిలో అభివృద్ధి ఛాయలు కానరావడం లేదు. అధిక శాతం గిరిజన గ్రామాలే ఉండడంతో ఐదేళ్లుగా గిరిజన గ్రామాలకు మౌలిక సౌకర్యాలు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గిరిజన పల్లెల వైపు తొంగిచూసే నాధుడే కరువయ్యారు. ఎన్నికల్లో తప్ప మిగతా సమయాల్లో గిరిజన గ్రామాల వైపు పాలకులు చూడడం లేదని, ఇక్కడ బాగోగులు పట్టడం లేదని వాపోతున్నారు. మండలంలో వంద గ్రామాలు పైబడే గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఏళ్ల గడుస్తున్నా పూర్తిస్థాయి రహదారి సౌకర్యానికి దూరంగా ఉన్నారు. వేసవి కాలం మాట ఎలా ఉన్నా... మిగతా సమయాల్లో రహదారులు నరకయాతనగా తయారవుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో గిరిపుత్రులు నానా అవస్థలు పడుతున్నారు. కొండపై గ్రామాల గిరిజనులకు డోలీలు మోత తప్పడం లేదు. ఆర్ అండ్ బి రోడ్ నుంచి దారిపేటకు వెళ్లే రహదారి రాళ్లు తేలి దయనీయంగా మారింది. నేల బొంతు నుంచి మూలనెల బొంతుకు రహదారి అభివృద్ధి కొరబడింది. గొడ్డ నుంచి అంపురానికి ఏడో కిలోమీటర్ల రహదారి ఐదేళ్లుగా అభివృద్ధి లేక నేటికీ మట్టి రోడ్డే గిరిపుత్రులకు శరణ్యమయ్యింది. ఈ ప్రాంతంలోని పది గ్రామ ప్రజల రాకపోకలకు అసౌకర్యం ఏర్పడింది. నేలబొంతు నుంచి వీరన్నపేట మీదుగా గొట్టిపల్లి వరకు ఉండే ఐదు కిలోమీటర్ల బిటి రోడ్డు రాళ్లు తేలాయి. రహదారి పిచ్చిమొక్కలతో మూసుకుపోయింది. ఈ రోడ్డులో టెక్కలి నుంచి వీరన్నపేట గాటి వరకు గతంలో ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఉండేది. రహదారి అభివృద్ధి లేకపోవడంతో బస్సు సౌకర్యం దూరం కావడంతో గిరిజనులు నాన అవస్థలకు గురవుతున్నారు. అలాగే డబ్బగుడ్డి, హడ్డివాడ కొండపై భాగంలో ఉండే అడ్డువాడ, చందనగిరి గేటుపేట గ్రామాల రహదారి అభివృద్ధికి దూరంగా ఉంది. భరణికోట కాలనీ నుంచి బాలేరుకు వెళ్లే బిటి రోడ్డు రాళ్లు తేలాయి. మెళియాపుట్టి-పలాస రోడ్డు నుంచి పదనాపురానికి వెళ్లే రోడ్డు రాళ్లు తేలియాడడంతో ఇటీవల మట్టి రోడ్డు వేశారు. గిరిజన గ్రామాల అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యం చూపడంతో అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. కొండ ప్రాంతంలో నివాసం ఉంటూ వారి జీవనోపాధికి వనరులు లేక ఇంకా పేదరికంతోనే మగ్గుతున్నారు. గతేడాది వర్షాలు సక్రమంగా లేకపోవడంతో పోడు పంటలూ పండలేదు. తాగునీటి సమస్య, వైద్య సేవలు సమస్య వెంటాడుతున్నాయి.



అధ్వానంగా గొడ్డ-అంపురం రోడ్డు



పిచ్చిమొక్కలతో మూసుకుపోయిన గొట్టిపల్లి రోడ్డు

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వాలంటీర్లు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులే వాలంటీర్లని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలం, మున్సిపాలిటీ పరిధిలోని వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలను అర్హుల ఇంటి ముంగిటకు చేరవేస్తున్న ఘనత వారికే దక్కుతుందన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రతిభను కనబరుస్తున్న వాలంటీర్లే మా బలగం, బలం అన్నారు. అవినీతికి తావు లేని వాలంటీర్ వ్యవస్థను సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని, జగనన్న సైన్యాన్ని చూసి రాష్ట్రం గర్విస్తుందన్నారు. ప్రభుత్వంపై ఎవరు నిందలు వేసినా నిజాలు చెప్పగలిగే సత్యసారథులు వలంటీర్లేనని అన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, బోర చిన్నంనాయుడు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, దుంపల శ్యామలరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సన్మానించి అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సేవవజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బిసిసెల్ జోనల్ రాష్ట్ర ఇన్‌ఛార్జి డాక్టర్ ధర్మాన కృష్ణదాస్, ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పోన్నాన దాలినాయుడు, వైస్ ఎంపిపి పాగోటి రాజారావు, చింతల వెంకటరమణ, జెసిఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు, సుడా చైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త, పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న, ప్రచార జిల్లా కార్యదర్శి బార్ల వేణుగోపాలరావు పాల్గొన్నారు.



ఆమదాలవలస : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

నాబార్డు మేనేజర్ పోస్టుకు ఎంపిక

ప్రజాశక్తి- పొందూరు



రమేష్

మండలం తోలాపికి చెందిన పప్పల రమేష్ నాబార్డులో ఆల్ ఇండియా కేటగిరీలో ఎంపికై నాబార్డు మేనేజర్‌గా ఉద్యోగం పొందారు. ఈ నెల 21న ఫలితాలు విడుదలకాగా ఆల్ ఇండియా లెవెల్‌లో గ్రేడ్-ఎ పోస్టును దక్కించుకున్నారు. రమేష్ బిటెక్ పూర్తి చేశారు. గతంలో టిసిఎస్ ఇంజినీర్‌గా పనిచేశారు. ప్రస్తుతం అమరావతిలో ఆప్కాబ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈయన తండ్రి హరి అప్పారావు పూసపాటిరేగలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా, తల్లి విజయలక్ష్మి గృహిణి. ఈయన విజయం పట్ల రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు, విశ్రాంత ఆర్ఐఒ దుంపల శ్యామలరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు వప్పల రమేష్ కుమార్, జిల్లా ఎపిటిఎఫ్ కార్యదర్శి తిరుమలరావు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

విజనరీ నాయకుడు చంద్రబాబు

శ్రీకాకుళం అర్బన్ : విజనరీ ఉన్న నాయకుడు నాయకుడు చంద్రబాబు అని, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ఆయన వలనే సాధ్యమని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. యువ ఓటర్లంతా తమ భవిష్యత్‌కు పాటుపడే నాయకుడికే ఓటు వేయాలని సూచించారు. 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబిఎన్' క్యాంపెయిన్‌లో భాగంగా బృందావన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువ ఓటర్లతో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో తొలిసారి ఓటుహక్కు వినియోగించుకునే వారు కీలకమని, ఎంతో ఆలోచన కలిగి విజ్ఞతతో ఓటు వేయాలన్నారు. భావి తరానికి మార్గ నిర్దేశంగా పాలన ఉండాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ ఐటీ కంపెనీలు, ఇతర పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ముందు చూపుతో యువతకు నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కోసం ప్రత్యేకంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, ఉపాధి కోర్సులతో లక్షలాది మంది యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఉన్న పరిశ్రమల మూతకు కారణమయ్యారన్నారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మెండ దాసు నాయుడు, కొర్ను ప్రతాప్ పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నాయకులు

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- పలాస

పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అభిమానులు, కార్యకర్తలు, వైసిపి నాయకులు గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, పాలిన శ్రీనివాసరావు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రత్త అన్వేష్, ఇచ్ఛాపురం, కవిటి మండలాల క్రిస్టియన్ల అడ్వయిజర్ జాన్, సెక్రెటరీ సుందరరాజు, భిమో బెహ్రా, ఏలియా అప్పలరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




నోటీసులు అందజేస్తున్న పోలీసులు

నోటీసులు అందజేత

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ఎపి జెఎసి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్య వేదిక పిలుపుమేరకు విజయవాడలో ఈ నెల 27న మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు హాజరు కావద్దని సూచిస్తూ... సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు బోనేల గోపాల్, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, సెక్రెటరీ బి.ఉపేంద్ర, అసోసియేషన్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ కంచరాను చాణిక్య, ట్రెజరర్ ఎన్.ఉపేంద్రకు గురువారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు, భావ ప్రకటన, జీవించే హక్కు అందరికీ సహజంగా రాజ్యాంగం కల్పించిందన్నారు. శాంతియుతంగా మద్దతు తెలిపేందుకు వెళ్లనున్న ఉద్యోగులకు నోటీసులు ఇవ్వడం బాధాకరమని తెలిపారు. దేశంలో కష్టపడే రైతుకు గిట్టుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేసే ఉద్యోగులు ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించే వారు కరువయ్యారన్నారు.



బోల్తా పడిన కారు

కల్వర్టులో కారు బోల్తా

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలం షలంత్రి, సవళాపురం గ్రామాల మధ్య ప్రధాన రహదారి పక్కన ఉన్న కల్వర్టులో బుధవారం అర్ధరాత్రి కారు బోల్తా పడింది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం కొత్తూరు మండలం మెట్టూరు గ్రామానికి చెందిన పెట్టిన వినోద్ కుమార్ విశాఖపట్నం నుంచి భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి స్వగ్రామానికి కారులో వస్తున్నారు. మార్గమధ్యంలో సవాళాపురం, షలంత్రి గ్రామానికి వచ్చేసరికి అర్ధరాత్రి 12 గంటల సమయంలో కారుకు కుక్క అడ్డుగా రావడంతో దానిని తప్పించబోయే క్రమంలో ఒక్కసారిగా కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి చెరువులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వినోద్ కుమార్, భార్య, ఇద్దరు పిల్లలు కారులో నుంచి చిన్నపాటి గాయాలతో బయటికి వచ్చి 108 వాహనం ద్వారా ఆస్పత్రికి చేరుకున్నారు. గురువారం సాయంత్రం వినోద్ కుమార్ సరుబుజ్జిలి పోలీసులకు కారు ప్రమాదంపై సమాచారం ఇచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలియజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

కొత్తూరు: అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు సంబంధించి పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలోని యుడిసిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022 నుంచి పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. దీంతో నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే మార్చి 6న ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.వి.హేమలత కె.లక్ష్మి, ధనలక్ష్మి, జలజాక్షి, నీరజ, అమ్మాయమ్మ, శ్రీలత, పద్మ, జయలక్ష్మి, అరుణ, వరలక్ష్మి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

పిసిసి ఉపాధ్యక్షులు సత్యవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని పిసిసి ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దగా డిఎస్‌సి వద్దు, మెగా డిఎస్‌సి ముద్దు అంటూ సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ కార్యక్రమానికి హాజరైన బొడ్డేపల్లి సత్యవతిని పోలీసులు అదుపులోకి తీసుకొని విజయవాడలోని గాంధీనగర్‌లో చాంద్ కళ్యాణ మండపానికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఇన్నాళ్లు మొద్దు నిద్రలో ఉండి నేడు దగా డిఎస్‌సిని ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో నిరుద్యోగులందరికీ న్యాయం చేస్తానని, ప్రతి ఏడాది జనవరిలో జాబ్ కేలండర్ రిలీజ్ చేస్తానన్న హామీని తుంగలో తొక్కి నేడు తప్పుడు నోటిఫికేషన్లు ఇస్తూ ఉద్యోగులతో పాటు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అన్ని వర్గాల వారిని వైసిపి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో వైసిపి కేంద్రంలోని బిజెపికి అన్ని బిల్లుల్లోనూ సహకరించి బి టీంగా వ్యవహరించిందని మండిపడ్డారు. అరెస్ట్ అయిన వారిలో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, కాంగ్రెస్ నాయకురాలు జి.రజిని ఉన్నారు.



కాంగ్రెస్ నాయకులను నిర్బంధించిన పోలీసులు

రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయం



శ్రీకాకుళం అర్బన్ : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న రామారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వంశధార ప్రాజెక్ట్ సాధకులు, మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు చిరస్మరణీయుడని రాష్ట్ర కళింగ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు అన్నారు. బొడ్డేపల్లి రాజగోపాలరావు 32వ వర్థంతి సందర్భంగా గురువారం నగరంలో ఏడు రోడ్ల కూడలి, సింహద్వారం వద్ద ఉన్న బొడ్డేపల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించి మాట్లాడుతూ రాజగోపాలరావు జిల్లాలో రైతులకు ముద్దుబిడ్డగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు బొడ్డేపల్లి దామోదరరావు, కెవిఎస్ నాయుడు, ఉమాశంకర్, తిర్లంగి లోకనాథం, దుంపల గోవిందరావు, యుగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పలాస: జిల్లా అన్నదాత ప్రదాత బొడ్డేపల్లి రాజగోపాలరావు అని, ఆయన జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడ్డారని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ జితేశ్వరరావులు అన్నారు. ఆయన 32వ వర్థంతి సందర్భంగా కాశీబుగ్గ కెటి రోడ్డులోని రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు 1952 నుంచి 1984 వరకు ఆరుసార్లు శ్రీకాకుళం ఎంపీగా ఎన్నికయ్యారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, సిపిఐ నాయకులు చాపర సుందరలాల్, లండ వెంకటరావు, చాపర వేణుగోపాల్, బమ్మిడి నాగేశ్వరరావు, దువ్వాడ హర్షకుమార్, బడ్డ నాగరాజు, మోహన్, పైల జవహర్, రవి, పైల శ్రీను, కొర్ల హేమారావు చౌదరి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మాజీ ఎంపీ, కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వర రావు అన్నారు. రాజగోపాలరావు వర్థంతి సందర్భంగా స్థానికంగా ఉన్న ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ, పారిశ్రామికి అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. హిరమండలం వంశధార ప్రాజెక్టుకు అప్పటి సిఎం సంజీవయ్యతో శంకుస్థాపన చేసి జిల్లా రైతులకు సాగునీరు అందించారన్నారు. అలాగే ఆమదాలవలసలో సుగర్ ఫ్యాక్టరీ స్థాపనలో ఆయన కృషి మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు, పేడాడ వెంకటరావు, అన్నెపు రామారావు, మెట్ట సింహాచలం, పేడాడ వెంకటరావు, సింగుపురం వినోద్, వంశధార విద్యాసంస్థల కరస్పాండెంట్ చింతాడ అనిరుద్రుడు పాల్గొన్నారు. అలాగే హరిశ్చంద్రపురం కూడలి వద్ద ఉన్న రాజగోపాలరావు విగ్రహానికి సర్పంచ్ గురువెల్లి కేశవరావు, బగాది దివాకర్‌లు పూలమాలలువేసి నివాళ్లర్పించారు.



మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

ఎక్కువ కేసుల రాజీకి కృషి

కోటబొమ్మాళి: పెండింగ్‌లోని అన్ని రాజీ పడదగ్గ క్రిమినల్ కేసుల్లో పోలీసులు కక్షిదారులకు నోటీసులు జారీ చేసి వారిని ముందస్తుగా ఫ్రీ లోక్ అదాలత్‌కు వచ్చేలా కృషి చేయాలని, తద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీపడేలా చర్యలు చేపట్టాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. కోటబొమ్మాళి కోర్టు ఆవరణలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు పోలీస్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలతో కేసులు పెట్టుకున్న వారిని ముందుగా గుర్తించి తక్షణమే ఇరు పార్టీలకు నోటీసులు జారీ చేసి వారు కోర్టుకు తీసుకొస్తే ముందస్తు లోక్ దాలతల ద్వారా చర్చలు చేపడతామని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

జిఒలు తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు జిఒలు ఇచ్చి, వెంటనే అమలు చేయాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పౌరుమా మిల్ల సుబ్బారాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులపై వివక్ష చూపిస్తోందన్నారు. జిఒలు అమలు చేయకపోతే మళ్లీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులతో పాటు ఇంజినీరింగ్ కార్మికులకు, మున్సిపల్ స్కూల్ స్వీపర్స్, పార్క్ వర్కర్స్, పర్మినెంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.వేణుగోపాల్, కె.అప్పలరాజుతో పాటు జె.గురుమూర్తి, ఎం.రాఘవ, ఎన్.పార్థసారధి, డి.రవణ, కె.తిరుమల తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రామారావు, షణ్ముఖరావు, మోహన్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శాంతి పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో భరణికోట కాలనీలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని నందిని (11) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను పాఠశాల హెచ్‌ఎం, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈమెతో పాటు వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ ప్రతినిధి పల్లి యోగి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, గొప్పిలి సర్పంచ్ పల్లి జయసుధ ఉన్నారు.

ఎమ్మెల్సీ...

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజరు పంచాయతీ ఎంపిటిసి కమ్మకట్టు శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ గరువారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు, అరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని కోరారు. ఈయనతో పాటు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, వైస్ ఎంపిపి బోయిన నాగేశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ గెడ్డవలస నాగభూషణరావు, సర్పంచ్‌లు బొడ్డు రమణ, పేడాడ వెంకటరావు, ఉన్నారు.



మెళియాపుట్టి : పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రేపు ఎంఆర్‌పిఎస్ ఆత్మీయ సభ

ఆమదాలవలస : ఎంఆర్‌పిఎస్ ఆత్మీయ సభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు కోరారు. గురువారం పట్టణంలో ఎంఆర్‌పిఎస్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ ఈనెల 24న పట్టణంలో కామేశ్వరి కళ్యాణ మండపంలో ఎంఆర్‌పిఎస్(మాదిగ దండోరా), ఉప కులాల అనుబంధ సంఘాల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఎంఆర్‌పిఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ వస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎంఆర్‌పిఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు లోపింటి నారాయణరావు, టింగరాజు, ఎంఇఎఫ్ రాడ విజయ్ కుమార్ పాస్టర్, సవలాపురపు భాస్కరరావు, మురపాక కిరణ్, నవిరి గణేష్, చిన్నారావు పాల్గొన్నారు. సమావేశానికి జిల్లా స్థాయి ఎంఆర్‌పిఎస్, ఎంఇఎఫ్, మాదిగ యువసేన తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పొందూరు : మండలం లోలుగు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఇఇ బయ్యన్నాయుడు తెలిపారు. లోలుగు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 33 కెవి లైన్ల మరమ్మతుల కారణంగా లోలుగు, దల్లిపేట, బురిడి కంచరాం, కేశవదాసుపురం, నందివాడ, బాణం తదితర పంచాయతీల్లో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిబద్ధత లేని నాయకుడు ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజకీయాల్లో అవకాశవాదాన్ని నమ్ముకుని నిబద్ధత కొరవడిన నాయకుడు మంత్రి ధర్మాన ప్రసాదరావు అని టిడిపి సీనియర్ నాయకులు, మాజీమంత్రి గుండ అప్పల సూర్యనారాయణ విమర్శించారు. గురువారం అరసవల్లిలో ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలసి విలేకర్లతో మాట్లాడారు. ధర్మాన కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఇందిరాగాంధీ, సోనియా గాంధీలను మించిన నాయకులు లేరని గొప్పగా చెప్పేవారని, ఆ సమయంలో జగన్మోహన్ రెడ్డిని అవినీతి పరుడంటూ విమర్శలు చేసేవారని గుర్తు చేశారు. ఆయన మంత్రి వర్గంలో చేరిన తర్వాత జగన్మోహన్‌రెడ్డిని ఇంద్రుడు, చంద్రుడని పొగుడుతున్నారన్నారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతిపైసా ప్రజాధనమని, వాలంటీర్లకు ఇస్తున్న జీతాలు ప్రజాధనం నుంచే చెల్లిస్తునారని, అటువంటి వారిని వైసిపి బూత్ ఏజెంట్లుగా కాపలా కాయాలని మంత్రి ధర్మాన మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధం కాదా అని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న అప్పల సూర్యనారాయణ

ముమ్మరంగా ఆటోల తనిఖీ



అవగాహన కల్పిస్తున్న సిఐ అవతారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ సిఐ అవతారం గురువారం ఆటోలను ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అధిక ప్రయాణికులు, స్కూల్ పిల్లలు తీసుకువెళ్తున్న ఆటోలను ఆపి అవగాహన కల్పించారు. పరిమిత ప్రయాణికులతో, అలాగే స్కూల్ పిల్లలకు రక్షణ కల్పించే విధంగా ఆటోలలో ఎక్కించాలని డ్రైవర్లకు సూచించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోలు ముఖ్యంగా పరిమిత ప్రయాణికులు మాత్రమే ఎక్కించాలని లేకుంటే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా ఆటో డ్రైవర్లను ఒత్తిడి తీసుకురాకూడదని, పరిమితి మించిన విద్యార్థులను ఎక్కించరాదని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో రత్తకన్నలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బెందాళం అశోక్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు టిడిపి నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ నిధుల నుంచి రెండు కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.పది లక్షలు మంజూరయ్యాయని అన్నారు. పనులు వేగవంతంగా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కాళ్ల ధర్మారావు, సందక జాని, కొండ శంకరరెడ్డి, జయదేవ్, సాలిన ఢిల్లీ, లీలారావు, బుగత జాని, కాళ్ల దిలీప్‌కుమార్, నందిగాం కోటేశ్వరరావు, దక్కత ఢిల్లీరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అశోక్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు



జ్ఞాపికను స్వీకరిస్తున్న గౌతమి శాలి

గౌతమి శాలి అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని విశాఖపట్నం స్పెషల్ పోలీస్ కమాండెంట్ గౌతమి శాలి గురువారం సందర్శించారు. ఆమెకు ఆలయ అర్చకులు స్వాగతించారు. అనంతరం స్వామివారి సేవల్లో పాల్గొన్న ఆమెకు అనివేటి మండపంలో స్వామి వారి శేషవస్త్రాలను, జ్ఞాపికను ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు అందజేశారు. ఆమెతో పాటు ఒన్‌టౌన్ సిఐ ఎల్. సన్యాసినాయుడు పాల్గొన్నారు.



అప్పన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న శంకర్

శంకర్ పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలం సింగుపురం పంచాయతీ భైరినాగుల పేటకు చెందిన అప్పన్న తల్లి ఇటీవలే అనారోగ్యంతో మరణించడంతో కుటుంబసభ్యులను గురువారం టిడిపి యువ నాయకులు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శంకర్ పరామర్శించారు. అనంతరం మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయనతో పాటు పంగ రమేష్, ధర్మవరపు మల్లేష్, కుప్పిలి హతకేశం, ఇప్పిలి అసిరినాయుడు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ అధ్యక్షతన గురువారం ఇంటర్ విద్యార్థులు ఫేర్‌వెల్ కార్యాక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎద్దు గోపాల్‌దాస్‌నాయుడు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదివితే మరిన్ని విజయాలు సాధిస్తారని అన్నారు. అనంతరం సినీ పాటలకు వేసిన నృత్యాలు చూపరులను ఆనందపరిచాయి. కార్యక్రమంలో ఎంఇఒలు గోవిందరావు, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు, విశ్రాంత అధ్యాపకులు టి.ఆదినారాయణ, కళాశాల చైర్మన్ సారిపిల్లి కృష్ణవేణి పాల్గొన్నారు.

మున్సిపాల్టీ అభివృద్ధే ధ్యేయం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో రూ. 29 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శిష్టి బృదావతి, శిష్టి గోపి, బగాది సింహాచలం, సీపాన శ్రీరాములు, పిట్ట భాస్కరరావు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న గిరిబాబు

25న 'చలో పూసపాటిరేగ'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలగ సామాజిక వర్గానికి బిసి సాధనే లక్ష్యంగా ఈ నెల 25న చలో పూసపాటిరేగ ఆత్మగౌరవ మహాసభ నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షులు పివి రామారావు తెలిపారు. నగరంలో విశాఖ ఎ కాలనీలో తెలగ సంక్షేమ సంఘ భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో తెలగ సామాజిక వర్గం 10 లక్షల మంది ఉన్నారని, కొంత మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారన్నారు. 1962 ముందు బిసిల్లో ఉండే వారని తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఒసిల్లో చేర్చడంతో విద్య, ఉపాధి అవకాశాలు కోల్పోయామన్నారు. ఈ ఎన్నికల్లో తెలగ సామాజిక వర్గాన్ని



మాట్లాడుతున్న రామారావు

బిసిల్లో చేరుస్తామని మేనిఫెస్టోలో పొందుపర్చిన రాజకీయ పార్టీకి తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో శవ్వాన ఉమామహేశ్వరి, కొండా రాంబాబు, బొనం మురళీ, గోపీ కృష్ణ, నామాన పార్వతీశం, శశి పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి - సోంపేట

బెహరా తరగతులకు ఇచ్చిన ప్రకారం కమ్యూనిటీ హాల్ నిర్మించి మాట నిలబెట్టుకున్నాని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. బెహరా తరగతి పెద్ద నాగుల సింహాచలం అధ్యక్షతన కమ్యూనిటీ హాల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెహరా తరగతుల అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపిపి నిమ్మన దాసు, సర్పంచ్ నగిరి ప్రభావతమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు శిలాగాన భాస్కర్ పాల్గొన్నారు.

53 కుటుంబాలు చేరిక



ప్రారంభిస్తున్న విజయ

ఈ మేరకు బెహరా తరగతులకు చెందిన 53 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. ఈ మేరకు విజయ, సాయిరాజ్ వైసిపి జెండాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

బాధ్యతగా పనిచేయాలి

టెక్కలి రూరల్: వాలంటీర్లు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో టెక్కలి టౌన్ వాలంటీర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు వాటి అమలు తీరు నుంచి తెలుసుకున్నారు. ఇంకా ఎక్కడైనా పలు సమస్యలు ఉంటే త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సర్పంచ్ గొండేల సుజాత, జెసిఎస్ కన్వీనర్ సిగిలిపిల్లి మోమన్, కిల్లి అజయ్ కుమార్, ఎంపిడిఒ విజయలక్ష్మి, ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



టిడిపిలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మీదేవి

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరానికి చెందిన పలువురు కళింగ కోమట్లు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. నగర కళింగకోమటి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోరాడ రమేష్ ఆధ్వర్యాన అరసవల్లిలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సమక్షంలో వారు పార్టీలో చేరారు. విశ్రాంత ఉద్యోగులు జామి నాగభూషణరావు, బరాటం త్రివేణి, జామి కిరణ్, బెల్లన సోమేశ్వరరావు తదితరులు చేరారు. వారిని కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం నాయకులు కోరాడ హరి గోపాల్, పార్టీ నాయకులు జామి భీమ శంకరావు, కోరాడ వైకుంఠం, శ్రీనివాస్, తంగుడు చంద్రశేఖర్, బరాటం ఈశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయాలతో సుపరిపాలన అందించాం

మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సచివాలయాలతో సుపరిపాలన అందించామని రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రూ.కోటితో నిర్మించిన అంపోలు - 3, సత్తివాడ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో మూడు పంటలకు అవసరమైన నీటిని అందిస్తామని, కృష్ణ, గోదావరి జిల్లాల మాదిరిగా మన నేల కూడా సస్యశ్యామలం అవ్వబోతుందన్నారు. సచివాలయాల ద్వారా మెరుగైన పాలన అందుతుందని మంత్రి ధర్మాన తెలిపారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

విద్యార్థులు ఓ లక్ష్యాలను ఏర్పర్చుకుని ఉన్నత అవకాశాలు అందుపుచ్చుకోవాలని నౌపడ సర్పంచ్ ప్రతినిధి పిలక రవికుమార్‌రెడ్డి అన్నారు. నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోల సభ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భానుప్రకాష్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణ, బిగ్‌హెల్ప్ నౌపడ ప్రాజెక్టు చైర్మన్ రాజా, నౌపడ మాజీ సర్పంచ్ కర్రి విష్ణుమూర్తి,



మాట్లాడుతున్న రవికుమార్

ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, మల్లేశ్వరరావు, రమేష్, సింహాచలం, బిసి హాస్టల్ వార్డెన్ ఆనందరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఇచ్ఛాపురం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు సూచించారు. స్థానిక జాతీయ రహదారిపై ఈదుపురం రోడ్ కూడలి వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లుపాల్గొన్నారు.



జాతరలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

వైభవంగా దుర్గా భవానీ జాతర

ప్రజాశక్తి- పోలాకి

మండల కేంద్రంలోని కనక దుర్గా భవానీ 22వ జాతర మహోత్సవాలు వైభవంగా ఆలయ ధర్మకర్తలు టంకాల శ్రీరాములు భవానీ, పల్లి రాజు భవానీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. గురువారం తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు తరలివచ్చారు. జాతరలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ జాతర ఈ నెల 24 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

చిన్నారులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని తేలుకుంచిలో చిన్నారులకు కేశ పురానికి చెందిన కాళీమాత సేవా సమితి అండగా నిలిచింది. కొన్నేళ్ల కిందట తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథలయ్యారు. సమాచారం అందుకున్న కాళీమాత సేవా సమితి చిన్నారుల చదువుల నిమిత్తం రూ.12 వేలు ఆర్థికసాయాన్ని గురువారం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. దాతలు ముందుకొచ్చి ఆర్థికసాయం అందజేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- కవిటి

కవిటిలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వర ఆలయ నిర్మాణానికి దాతలు ఉదారంగా విరాళాలు అందిస్తున్నారు. హరిపురానికి చెందిన ఆనంద్ మెడికల్ షాపు యజమాని వావిలాల ఆనంద్ రూ.లక్ష విరాళంగా అందించగా, మండలంలోని జగతికి చెందిన విశ్రాంత డిఎస్‌పి ఎస్.వి.వి.ప్రసాదరావు రూ.60వేలు అందించారు.



విరాళం అందిస్తున్న ఆనంద్